## క్లుప్తంగా...

### రాఘవేంద్ర స్వామి ఆలయంలో హోమం



మేడ్చల్: పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో రాఘవేంద్ర ఆలయం 10వ వార్షికోత్సవం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా వివిధ రకాల పూజలు, హోమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

### సహజ భాష ప్రక్రియపై సదస్సు



ముఖ్యఅతిథులతో అనురాగ్ అధ్యాపకులు

ఘట్‌కేసర్: వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో అధ్యాపకుల బోధన నైపుణ్యం పెంపొందించడానికి అధ్యాపకులకు ×సహజ భాష ప్రక్రియ×పై మూడు రోజుల సదస్సును సోమవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా డీన్ విజయకుమార్, హెచ్‌ఓడీ మల్లికార్జున్ హాజరై అధ్యాపకుల బోధన సామర్థ్యం అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కన్వీనర్ అబ్దుల్ అహ్మద్, సంచాలకులు ఎం.మాధవి, ప్రొఫెసర్ ఆనంద్, యూనివర్సిటీ అధ్యాపకులు పాల్గొన్నారు.

### యువ సంఘర్షణ సభకు కాంగ్రెస్ నాయకులు



మేడ్చల్‌లో కాంగ్రెస్ ర్యాలీ

మేడ్చల్: నగరంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ పాల్గొన్న యువ సంఘర్షణ సభకు మేడ్చల్ నుంచి కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వివిధ ప్రాంతాల నుంచి నాయకులు కీసరకు వెళ్లి అక్కడి నుంచి నగరానికి ర్యాలీగా వెళ్లారు. పీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి నేతృత్వంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో గౌడవెల్లి సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ మండల నాయకులు పాల్గొన్నారు.

### స్కూల్‌లో అభివృద్ధి పనులపై ఆరా



ఘట్‌కేసర్: మన ఊరు–మన బడి కార్యక్రమంలో మంజూరైన కొర్రెముల్ జెడ్పీ పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు గదుల పనులు సర్పంచ్ వెంకటేశ్‌గౌడ్, పంచాయత్‌రాజ్ ఏఈ వెంకట్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో తెరిచే నాటికి అదనపు తరగతి పనులు పూర్తిచేసి అప్పగించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

### కబడ్డీ టోర్నీ విజేతలకు బహుమతులు



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: వెంకటాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన కబడ్డీ టోర్నీ విజేతలకు వైఎస్సార్ ట్రస్టు ఆధ్వర్యంలో బహుమతులను సోమవారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు తిరుమల్‌రెడ్డి, శ్రీనివాస్‌ముదిరాజ్, లింగంముదిరాజ్, నవీన్‌ముదిరాజ్, క్రీడాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ధాన్యానికి దిక్కేది?

- తేమ సాకుతో కొనుగోళ్లకు కొర్రీ
- ధాన్యం సేకరణ 30 వేల మెట్రిక్ టన్నులు
- కొనుగోలు చేసింది 400 క్వింటాళ్లే..
- తడిసిన ధాన్యం కొనాలన్న సర్కారు ఆదేశాలు బేఖాతరు
- జీవో లేకుండా కొనలేమంటున్న సొసైటీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ధాన్యం కొనుగోళ్లకు దిక్కులేని పరిస్థితి నెలకొనడంతో సేకరణ కేంద్రాల్లో ధాన్యం కుప్పలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మేడ్చల్ జిల్లాలో ధాన్యం సేకరణకు జిల్లా పౌరసరఫరాల శాఖ ఏప్రిల్ చివరి వారంలో ఏదులాబాద్, మాదారం, ప్రతాపసింగారం, మేడ్చల్‌లో.. సోమవారం మరో ఆరుచోట్ల ధాన్యం సేకరణ కేంద్రాలను మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అయినా.. ఇప్పటి వరకు ఒక ఏదులాబాద్ కేంద్రంలో మాత్రమే 400 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. మిగతా కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు ఇప్పటికీ చేపట్టపోవటంతో రైతులు వరి కుప్పలతో సేకరణ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో సేకరణ కేంద్రాలకు రైతులు తరలించిన ధాన్యం తడిసి పోగా, ఆరబెట్టిన తర్వాతే కొనుగోలు చేస్తామని సొసైటీలు పేర్కొనడంతో రైతులు దిక్కుతోచక ఆవేదన చెందుతున్నారు. ఘట్‌కేసర్ మండలంలోని మాదారం, ఏదులాబాద్‌లో వారం రోజులుగా ధాన్యం కుప్పలతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తేమ సాకుతో కేంద్రాలకు తరలించిన ధాన్యాన్ని సహకార సంఘాలు కొనుగోలు చేయడం లేదని రైతులు లబోదిబోమంటున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ప్రభుత్వం ప్రకటించినా.. జిల్లా పౌరసరఫరాల శాఖ పట్టించుకోవడం లేదని రైతులు పేర్కొంటున్నారు. అయితే.. ప్రభుత్వం నుంచి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని జీవో గానీ ఆదేశాలు గానీ వెలువడకపోవటం వల్లే తేమ శాతం ఎక్కువగా ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అందువల్లే తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని రైతులను కోరామన్నారు. తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉన్నట్లయితే ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం సేకరణ వీలుపడదని జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంటోంది.

#### 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో రైతుల నుంచి 30వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు 12 సేకరణ కేంద్రాల ఏర్పాటు చేయాలని పౌరసరఫరాల శాఖ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో 10 ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభించినా ఇటీవల కురిసిన వర్షం కారణంగా ధాన్యం సేకరణ చేయలేకపోయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయినా లక్ష్యానికి అనుగుణంగా ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామంటున్నారు.

#### పెరిగిన సాగుతో..

జిల్లాలో యాసంగి సీజన్‌లో సాధారణ వరిపంట సాగు విస్తీర్ణం 10,454 ఎకరాలు కాగా, 13,015 ఎకరాల్లో రైతులు వరి పంట వేశారు. దీంతో వరి ధాన్యం దిగుబడి 33 వేల మెట్రిక్ టన్నులు రాగలదని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో 30 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు జిల్లాలో గతేగాది కంటే ఎక్కువగా 12 ధాన్యం సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ధాన్యం సేకరణ కేంద్రాల్లో 7.50 లక్షల గన్నీ బ్యాగులతో సహా ఇతర వసతులను కల్పించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ తెలిపింది.

#### ధాన్యం సేకరణ కేంద్రాలివే..

మేడ్చల్ జిల్లాలో రైతుల నుంచి ధాన్యం సేకరణకు ప్రతాపసింగారం, ఏదులాబాద్, మాదారం, కేశవరం, లక్ష్మాపూర్, ఉద్దమర్రి, మేడ్చల్, డబుల్‌పూర్, పూడూరు, శామీర్‌పేట్, అలియాబాద్, కీసర కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ పేర్కొంది.

# కల్తీ కేంద్రంపై దాడి

- అల్లం వెల్లుల్లి పేస్టులో హానికరమైన రసాయనాలు
- ఎవర్ బెస్ట్ ఫుడ్స్ పేరిట జోరుగా విక్రయాలు
- రూ.50 లక్షల సామాగ్రి స్వాధీనం చేసుకున్న పోలీసులు

కీసర: కల్తీ అల్లం, మసాలా దినుసులు తయారు చేస్తున్న కేంద్రంపై ఎస్‌వోటీ పోలీసులు దాడి చేశారు. కీసర పోలీసులు, ఎస్‌వోటీ పోలీసుల వివరాల ప్రకారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ఈస్ట్ గాంధీనగర్ కాలనీలో రెండేళ్లుగా ఎవర్ బెస్ట్ ఫుడ్స్ పేరిట రసాయనాలతో అల్లం, వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు మసాలా దినుసులు తయారు చేస్తున్నారు. సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్‌వోటీ ఎస్ఐ రఘు నేతృత్వంలో దాడులు చేశారు. నిర్వాహకులు గోపాల్, విజయలక్ష్మీ, రేషన్ బియ్యం సేకరించి వాటికి మసాలా దినుసులు, హానికరమైన రసాయనాలు కలిపి ఎక్కువ రోజులు నిల్వ ఉండే విధంగా చేస్తున్నారు. ఇవి ఆరోగ్యానికి హానికరమని పోలీసులు తెలిపారు. సుమారు రూ.50 లక్షల సామాగ్రి స్వాధీనం చేసుకున్న తెలిపారు. నిర్వాహకులు గోపాల్, విజయలక్ష్మీపై 420, 272, 273 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



స్వాధీనం చేసుకున్న కల్తీ వెల్లుల్లి పేస్ట్ తయారీ వస్తువులు

### కార్యదర్శుల సమ్మెకు బీజేపీ మద్దతు

సాక్షి, మేడ్చల్ జిల్లా: సమస్యల పరిష్కారానికి మేడ్చల్ కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తున్న జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రటరీలకు బీజేపీ మద్దతు తెలిపింది. 11వ రోజు సమ్మెలో భాగంగా సోమవారం వారు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. నాలుగేళ్లుగా ఉద్యోగం చేస్తున్నా రెగ్యులరైజ్ చేయకపోవడంపై పంచాయతీ కార్యదర్శులు నిరసన వ్యక్తం చేశారు. జూనియర్, ఔట్ సోర్సింగ్ పంచాయతీ సెక్రెటరీల ఆందోళనకు మద్దతు తెలిపిన



బీజేపీ నాయకుల్లో భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకటరెడ్డి, రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, నాగరాజు, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, ఆంజనేయులు, చంద్రమౌళిచారి, ప్రశాంత్‌రెడ్డి ఉన్నారు.

## కళారూపాలే చైతన్యం నింపాయి

జవహర్‌నగర్: క్రాంతి కళాబృందం 20వ వార్షికోత్సవ కరపత్రికను సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రాంతి కళా బృందం వ్యవస్థాపకులు వెంకటచారి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ సమయంలో పాటలే ఉద్యమాన్ని తారస్థాయికి తీసుకెళ్లాయని, కళా రూపాలే ప్రతి ఒక్కరిలో చైతన్యం నింపాయన్నారు. అంతరించిపోతున్న గ్రామీణ కళారూపాలను కాపాడుకోవాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో నిర్వహించే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మీరా, మస్తాన్, బాటు, నర్సింహ, జంగిడి శ్రీనివాస్, బబ్లూచారి, తిరుపతి, విష్ణు, సావిత్రి, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



క్రాంతి కళాబృందం వార్షికోత్సవ కరపత్రికను ఆవిష్కరిస్తూ..

### చౌదరిగూడను సందర్శించిన డీఎల్పీఓ

ఘట్‌కేసర్: చౌదరిగూడ పంచాయతీని డీఎల్పీఓ స్మిత సోమవారం సందర్శించారు. పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్లు 879, 882, 801–807, 809, 862, 714లో అనుమతి లేకుండా నిర్మించిన అక్రమ కట్టడాల కూల్చివేతలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో పలు రికార్డులు తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి గౌతమి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



చౌదరిగూడ రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎల్పీఓ స్మిత, కార్యదర్శి గౌతమి

### జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌కు అర్హత




మంత్రి నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న పీఈటీ సత్యనారాయణ

ఘట్‌కేసర్: తెలంగాణ యోగాసన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 3–7 వరకు సిద్దిపేట్‌లో జరిగిన జడ్జెస్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఘట్‌కేసర్‌కు చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గుంటి సత్యనారాయణ అర్హత సాధించాడు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్యఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆయనకు సర్టిఫికెట్ అందజేశారు. దీంతో యోగా టోర్నీలో అంపైర్‌గా చేసే అవకాశం ఆయనకు లభించింది.

## నర్సింహరెడ్డి కళాశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి కళాశాల ఎదుట విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. కళాశాలకు చెందిన తృతీయ సంవత్సరం విద్యార్థులు తమ పరీక్ష ఫలితాలను కళాశాల యాజమాన్యం వెల్లడించడం లేదని ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కళాశాల ఫీజు కారణంగా పరీక్షా ఫలితాలు ఆపడం ఏంటని ఏబీవీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫలితాలు వెల్లడించాలని నినాదాలు చేశారు. గంట పాటు విద్యార్థులు ఆందోళన చేయడంతో విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలికి చేరుకుని ఆందోళనను అదుపు చేశారు. చివరకు ఫలితాలు వెల్లడించడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. కాగా విద్యార్థులు కళాశాల ఫీజు చెల్లించకుండా బకాయి ఉన్నారని, అయినా తాము విద్యార్థులు పరీక్షలు రాసేందుకు హాల్ టికెట్ ఇచ్చి అన్ని అవకాశాలు కల్పించామని, సెలవుల్లో ఇంటికి వెళితే తమ కళాశాల ఫీజులు ఎలా చెల్లిస్తారని, దీంతో తాము సిబ్బందికి జీతాలు ఎలా ఇస్తామని కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి తెలిపారు.



కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

### గీతాంజలిలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

కీసర: చీర్యాల గీతాంజలి కళాశాలలో సంస్థాగత స్థిరత్వం కోసం నాయకత్వం పాలన అంశంపై ఐదురోజుల పాటు నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ బిట్స్ పిలానీ సీనియర్ ఆచార్యులు డీన్ పి.యోగిశ్వర్, కళాశాల చైర్మన్ రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా. ఉదయ్‌కుమార్, ఈసీఈ విభాగం అధిపతి డా.పి.విజయభాస్కర్, డా.బీఎల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

### యువకుడి అదృశ్యం



రాకేష్(ఫైల్)

జవహర్‌నగర్: యువకుడు అదృశ్యమైన ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ విఘ్నేశ్వరి కాలనీలో నివసించే కోటేష్ కుమారుడు రాకేష్(17) బాలాజీనగర్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇటీవలే ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. ఈ నెల 7వ తేదీన ఉద్యోగం కోసం వెళ్తున్నానని చెప్పి ఇంటికి తిరిగిరాలేదు. ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలను అమలు చేస్తున్నారని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సోమవారం కీసర రైతు సహకార సొసైటీ ఆధ్వర్యంలో సుమారు రూ.1.5 కోట్లతో నూతనంగా నిర్మించిన గిడ్డంగి(గోదాం)ను ప్రారంభించడంతో పాటు వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ రైతుల కోసం రైతు బంధు, రైతుబీమా, వ్యవసాయానికి ఉచితంగా 24గంటల కరెంటు అందజేస్తున్న రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందంటే ఒక్క తెలంగాణే అన్నారు. రైతులు పండించిన వరిధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించాలన్నారు.
ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో రైతులు నష్టపోయారన్నారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం పంపిణీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించాడని, తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరకే రైతుల నుంచి కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కీసర రైతు సొసైటీ అధ్యక్షుడు రామిడి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బెస్త వెంకటేష్, కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరాలక్ష్మీనారాయణ, వైస్‌ఎంపీపీ జె.సత్తిరెడ్డి, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు నందరెడ్డి, డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మధుకర్‌రెడ్డి, సర్పంచులు నాయకపు మాధురి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ పన్నాల బుచ్చిరెడ్డి, కీసర మండల రైతుబంధు అధ్యక్షుడు పుల్లగుర్ల శ్రీనివాస్, సొసైటీ సభ్యులు, సిబ్బంది, ఆయా గ్రామాల ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో గోదాంను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు

#### కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించాలి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని మైనార్టీల కోసం కమ్యూనిటీ భవనాన్ని నిర్మించేందుకు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కోరుతూ సోమవారం నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో మైనార్టీ నేతలు మంత్రి మల్లారెడ్డితో పాటు జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహరెడ్డికి వినతి పత్రం అందజేశారు. త్వరలో ప్రభుత్వ స్థలం కేటాయించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మైనార్టీ నేతలు మహ్మద్ షఫీ, పాషా భాయ్, జహంగీర్, జలీల్ తదితరులు పాల్గొన్నారు.

#### పూడూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం

మేడ్చల్‌రూరల్: మండలంలోని పూడూర్ గ్రామంలోని ఆదర్శ రైతు సేవా సహకారం సంఘంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, జిల్లా రైతు సమన్వయకర్త నందారెడ్డి, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, వైస్‌ఎంపీపీ వెంకటేశ్, ఎంపీటీసీ రఘు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దయానంద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్లు సురేశ్‌రెడ్డి, రణదీప్‌రెడ్డి, వ్యవసాయాధికారులు అర్చన, సుమిత, సర్పంచులు, డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

### బస్తీ దవాఖానాలు ప్రారంభానికి సిద్ధం



దవాఖానాను పరిశీలిస్తున్న చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: యమ్నంపేట్, పోచారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న బస్తీ దవాఖానాలను చైర్మన్ కొండల్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన బస్తీ దవాఖానాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. దవాఖానాలను మంత్రి మల్లారెడ్డి త్వరలో ప్రారంభిస్తారని చెప్పారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### వధువుకు పుస్తె మెట్టెలు అందజేత



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌కు చెందిన గీత కుమార్తె దివ్య వివాహానికి డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, ఆయన సతీమణి నాగరాణిలు పుస్తె మెట్టెలు, నూతన వస్త్రాలు అందచేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ.. పేదవారికి సహాయం చేయడంలోనే నిజమైన ఆనందం ఉందన్నారు. మౌనికరెడ్డి, సవితాగౌడ్ తదితరులు ఉన్నారు.

## ప్రజాధనం దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసర గ్రామ పంచాయతీలో ప్రజాధనం దుర్వినియోగంపై నాలుగేళ్లుగా ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని బీజేపీ కీసర గ్రామ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. నాలుగేళ్ల వ్యవధిలో హరితహారం, ఫ్లెక్సీల బిల్లులు, ఎలక్ట్రికల్ గూడ్స్, ట్యూబ్ లైట్ల కొనుగోళ్లు, పల్లె ప్రగతి, పన్నుల వసూళ్లు తదితర వ్యవహారంలో సుమారుగా రూ.70 లక్షల ప్రజాధనం దుర్వినియోగమైందని, వివరాలతో కూడిన సమాచారాన్ని వినతి పత్రంతో ఆయన సమర్పించారు. ఏడాది కిందట కొన్ని అంశాలపై విచారణ జరిపి ఎంపీఓ, డీఎల్పీఓలు వేర్వేరుగా నివేదికలను జిల్లా పంచాయతీ శాఖ అధికారులకు అందజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదుకు ముందు కలెక్టరేట్ వద్ద బీజేపీ నాయకులు, కార్యకర్తలు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోగారం ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, బీజేపీ నాయకులు రవీందర్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్, చంద్రమౌళి, అంజి, నాగరాజు, శ్రీనివాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



### కలెక్టరేట్ ప్రజావాణిలో 90 అర్జీలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణిలో ప్రజలు అందించిన 90 ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ కోరారు. పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలన్నారు. సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై ప్రజావాణిలో రాతపూర్వకంగా వినతి పత్రాలు అందజేశారు. పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల్లో అక్రమ కట్టడాలు, ప్రభుత్వ, అసైన్డ్ భూముల కబ్జా, భూవిస్తీర్ణంలో తేడాలు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, మిస్సింగ్ సర్వే నంబర్లు, భూమి రకంలో తేడాలు, పట్టాభూమి అసైన్డ్ భూములుగా నమోదవడం వంటి సమస్యలపై పలువురు జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రాలు అందజేశారు. భూకబ్జాలు, అక్రమ నిర్మాణాలపై కూడా వినతులు సమర్పించారు. కార్యక్రమంలో డీపీఓ రమణమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

